# సుదీర్ఘ పోరాటానికి సిద్ధం!

- **ఇజ్రాయెల్ భూతల దాడులకు దిగినా ఎదుర్కొంటాం: హెజ్బొల్లా ప్రకటన**
- **సెంట్రల్ బీరుట్‌పై తొలిసారి ఇజ్రాయెల్ వైమానిక దాడి**



*బీరుట్‌లోని కోలా జిల్లాలో ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న ఓ భవనం*

బీరుట్, సెప్టెంబర్ 30: ఎడాపెడా దాడులతో ఇజ్రాయెల్ ఊపిరి సలపనీయకుండా చేస్తున్నప్పటికీ లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా మాత్రం తాము వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేస్తున్నది. ఆ సంస్థ చీఫ్ హసన్ నస్రల్లాతో పాటు పలువురు కమాండర్లు ఇటీవల దాడుల్లో మరణించారు. అయినప్పటికీ తాము ఇజ్రాయెల్‌తో పోరాడుతూనే ఉంటామని హెజ్బొల్లా తాత్కాలిక నేతగా వ్యవహరిస్తున్న నయీమ్ కాసీమ్ సోమవారం ప్రతిజ్ఞ చేశారు. పదాతి దళాలతో దాడి చేయడానికి ఇజ్రాయెల్ కనుక వస్తే దానిని ఎదుర్కోడానికి తాము కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. దాడుల్లో కమాండర్లు గాయపడినా, మరణించినా, వారి స్థానాలను డిప్యూటీ కమాండర్లతో వెంటనే భర్తీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందని తాము భావిస్తున్నామని ఆయన చెప్పారు.

**లెబనాన్ టాప్ కమాండర్ కుటుంబం మృతి**

లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని ఓ నివాస భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి చేయడం ఇదే తొలిసారి. ఈ దాడిలో ఇద్దరు మరణించారు. మరోవైపు దక్షిణ పోర్టు నగరమైన టైర్‌లోని ఒక శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో లెబనాన్ టాప్ కమాండర్ ఫతే షరీఫ్ అబు ఎల్-అమీన్, అతని భార్య, కుమారుడు, కుమార్తె మరణించినట్టు హమాస్ ప్రకటించింది. వీరే కాక ముగ్గురు మిలిటెంట్లు కూడా మరణించారు.

**పేజర్ పేలుళ్లలో కేరళ వాసిపై ఇంటర్నేషనల్ వారెంట్**

ఇటీవల లెబనాన్‌లో వాకీటాకీలు, పేజర్లు పేలడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే ఈ కేసుకు సంబంధించి కేరళలో జన్మించిన నార్వే వ్యాపారవేత్త రిన్సన్ జోస్ పేరు విన్పిస్తున్నది. బల్గేరియా కేంద్రంగా పనిచేసే ఇతని సంస్థ ద్వారానే లెబనాన్‌లోని హెజ్బొల్లా గ్రూప్‌నకు పేజర్లు సరఫరా అయినట్టు నిర్ధారణ కావడంతో ఆయనపై అంతర్జాతీయ వారెంట్ జారీ అయ్యింది. నోర్తా గ్లోబల్ లిమిటెడ్ కంపెనీ ఈ పేజర్ల డీల్ వెనుక ఉందని హంగేరియన్ మీడియా వెల్లడించింది. దీనిని జోస్ 2022లో స్థాపించారు.

# ఇక మిగిలింది అణు కార్డే!

**ఇరాన్‌పై సామాజిక మాధ్యమాల్లో ఒత్తిడి**

టెహ్రాన్, సెప్టెంబర్ 30: హెజ్బొల్లాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌కు అడ్డుకట్ట వేయాలని ఇరాన్‌పై ఒత్తిడి పెరుగుతున్నది. అణుబాంబు ప్రయోగించాలని ఛాందసవాదులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలని వారు కోరుతున్నారు. ఛాందసవాది సయ్యద్ జలీల్ అనుచరులు ఈ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో సంస్కరణవాది మసూద్ పెజిష్కియాన్ చేతిలో జలీల్ ఓటమిపాలయ్యారు. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిపై వీరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఇరాన్ ఇప్పటికే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంది. ఇక మిగిలింది అణు కార్డే. ఇదే పశ్చిమ దేశాలను చర్చలకు కూర్చోబెడుతుంది' ఓ యూనివర్సిటీ ప్రొఫెసర్ సొహ్రాబ్ సాలేహి ఎక్స్‌లో పోస్టు చేశారు.

**ఇరాన్‌కు త్వరలోనే విముక్తి: నెతన్యాహూ**

ఇరాన్‌లో పౌరులకు సరైన ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఇరాన్ ప్రభుత్వం విఫలమైందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆరోపించారు. ఖమేనీ పాలనలో వారు అంధకారంలో కూరుకుపోయారని, పలు రంగాలు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. ఇరాన్ త్వరలోనే విముక్తి పొందుతుందని పేర్కొన్నారు.

# దేవుళ్లను రాజకీయాల్లోకి లాగొద్దు!

➤ మొదటిపేజీ తరువాయి...

జరపగలదా? అన్న సందేహాలు లేవనెత్తింది. ఈ మేరకు లడ్డూ వివాదంపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 3కు వాయిదా వేసింది.



**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

- స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించినట్లు ఎలా తెలిసింది? అయినా, కల్తీ నెయ్యిని వాడకుండా పక్కనబెట్టామని టీటీడీ ఈవో చెప్పారు కదా! అలాంటప్పుడు, లడ్డూ తయారీలో ఆ నెయ్యిని వాడినట్లు ఎలా చెప్పారు?
- దీన్నిబట్టి కల్తీ నెయ్యిని లడ్డూలో వాడినట్టు ఆధారాలు లేవని అర్థమవుతున్నది. అలాంటప్పుడు లడ్డూ కల్తీ జరిగిందని ఎలా చెప్పారు?
- లడ్డూ కల్తీ జరిగిందనుకొందాం. అయితే, ఆ శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారా? పంపితే, వాటి రిపోర్టులేవి?
- టెస్టుల కోసం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కే నెయ్యిని ఎందుకు పంపాల్సి వచ్చింది?
- మైసూరు, ఘజియాబాద్‌లో కూడా ల్యాబ్‌లు ఉన్నాయి కదా. సెకండ్ ఒపీనియన్ కోసం అక్కడికి శాంపిల్స్ ఎందుకు పంపలేదు.
- (సీఎం చంద్రబాబును ఉద్దేశిస్తూ..) నెయ్యి కల్తీ జరిగినట్టు జూలైలో నివేదిక వచ్చిందంటున్నారు. మరి ఆ విషయాన్ని సెప్టెంబర్‌లో తీరిగ్గా ఎందుకు చెప్పాల్సి వచ్చింది?
- నెయ్యి కల్తీ అయ్యిందా? లేదా? ఆ నెయ్యిని లడ్డూకి వాడారా? లేదా? అని తేల్చేందుకే సిట్ ఏర్పాటు చేశారు.
- ఒకవైపు సిట్‌ను ఏర్పాటు చేసిన మీరు (సీఎం).. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో చేసిన కల్తీ నెయ్యిని గత ప్రభుత్వ హయాంలో వాడారంటూ మీడియా ముఖంగా తేల్చిచెప్పడమేంటి? అలాంటప్పుడు సిట్ దర్యాప్తు ఎందుకు?
- కల్తీ నెయ్యిని లడ్డూలో వాడారో లేదో పూర్తిగా తెలియకుండా మీడియా ముందుకు మీరు (సీఎం) వెళ్లాల్సిన అవసరమేంటి?
- ఇక్కడ మరో విషయం. ఒకవైపు లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని సీఎం ప్రకటిస్తే, టీటీడీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) మాత్రం కల్తీగా తేలిన నెయ్యిని అసలు లడ్డూ తయారీలో వాడలేదంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?
- ఇది కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయం. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దు. కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి. సీఎం తన వ్యాఖ్యలతో లక్షలాది మంది మనోభావాలను గాయపర్చారు.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం నియమించిన సిట్ సరిగ్గా విచారణ జరపగలదా? అనే అనుమానాలు మాకు కలుగుతున్నాయి.
- ఈ లడ్డూ వివాదంపై కేంద్రం ఏర్పాటు చేసే స్వతంత్ర కమిటీ విచారణ జరిపితే బావుంటుందేమో? అని మాకు అనిపిస్తున్నది.

**ఏమిటీ వివాదం?**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీకి గురైనట్టు ఎన్‌డీడీబీ ల్యాబ్ తన నివేదికలో ఆరోపించింది. ఈ విషయాన్ని సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబు మీడియాకు తెలియజేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తిరుమల స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి విషయంలో నిజం నిగ్గు తేల్చాలంటూ బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు సీఎం చంద్రబాబు వైఖరిని తప్పుబడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేసింది.

## 'తాత్కాలిక డీజీపీల నియామకంపై వివరణ ఇవ్వండి'

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): తాత్కాలిక డీజీపీల నియామకం వ్యవహారంలో తెలంగాణ, ఏపీతో పాటు ఏడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక డీజీపీలను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 8న సావిత్రి పాండే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. డీజీపీ పోస్టు ఖాళీ కావడానికి మూడు నెలల ముందే తదుపరి డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుందని సావిత్ర పాండే తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

# పదవి ఉందని పెదవి జారితే..

- **అబద్ధాలను నిజం చేయాలని చూస్తే ఇలానే ఉంటుంది**
- **ధర్మాగ్రహాన్ని గుర్తించి.. సుప్రీంకోర్టు సత్యం చెప్పింది**
- **తిరుమల లడ్డూ వివాదంపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన**



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యల నేపథ్యంలో వైసీపీ స్పందించింది. సత్యమేవ జయతే అంటూ అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా ట్వీట్ చేసింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ఆ పార్టీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్వాగతించారు. ధర్మాగ్రహాన్ని గుర్తించి.. సుప్రీంకోర్టు ధర్మాసనం సత్యం చెప్పిందన్నారు. పదవి ఉందని పెదవి జారితే, అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తే.. భక్త ద్రోహం చేయాలని చూస్తే ఇలానే ఉంటుందంటూ విమర్శించారు. తిరుమల లడ్డూపై జరిగిన దుర్మార్గపు ప్రచారం.. మొత్తం ప్రపంచాన్ని కలిచివేసిందని అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలతో హిందూ సమాజంలో భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భగవంతుడు ఆగ్రహించి ధర్మాసనం రూపంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయించినట్లు భావిస్తున్నామన్నారు. టీటీడీ ఈవో చెప్పిన మాటలకు భిన్నంగా.. సీఎం చంద్రబాబు జంతువుల కొవ్వు వాడారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ విషయంలో తప్పు జరిగింది అంటూ విషప్రచారం చేశారని మండిపడ్డారు. తప్పు చేయలేదు కాబట్టే ధైర్యంగా తాము విచారణ కోరామని భూమన అన్నారు. స్వామి వారి వైభవాన్ని తగ్గించే విధంగా చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్నారని హిందూ సమాజం వారిని చీకొడుతోందని ఆయన అన్నారు.

**బాబు, పవన్‌పై ప్రకాశ్‌రాజ్ మళ్లీ ట్వీట్**

తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ మరోసారి ఎక్స్ వేదికగా స్పందించారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను జోడిస్తూ చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ఫొటో ఉన్న పోస్టును షేర్ చేశారు. ఆ ఫొటో కింద దేవుడిని రాజకీయాల్లోకి లాగకండి అంటూ ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ వివాదానికి సంబంధించి ప్రకాశ్‌రాజ్ ఇటీవల చేసిన కామెంట్స్‌పై పవన్‌కల్యాణ్‌తో పాటు జనసేన నాయకులు, మూవీ ఆర్టిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచువిష్ణు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా మరోసారి ప్రకాశ్‌రాజ్ లడ్డూ వివాదంపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

## అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లు

**భారతీయులకు అమెరికా శుభవార్త**

న్యూఢిల్లీ: భారతీయులకు అమెరికా శుభవార్త చెప్పింది. భారత పర్యాటకులు, నిపుణులైన కార్మికులు, విద్యార్థుల కోసం అదనంగా 2.5 లక్షల వీసా అపాయింట్‌మెంట్లను ప్రారంభిస్తున్నట్టు భారత్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఇటీవల కొత్త స్లాట్‌లను విడుదల చేశామని, అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వేలమంది భారతీయులు సకాలంలో ఇంటర్వ్యూలను పొందేందుకు ఇవి ఎంతో దోహదం చేయడంతోపాటు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నది. వరుసగా రెండో ఏడాది కూడా 10 లక్షల వలసేతర (నాన్-ఇమ్మిగ్రెంట్) వీసా దరఖాస్తులను అధిగమించామని, ఇప్పుడు కుటుంబాలను, వ్యాపారులను కలపడంతోపాటు పర్యాటకాన్ని సులభతరం చేయడంపై దృష్టి సారించామని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. కాగా, ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షల మందికిపైగా భారతీయులు అమెరికా వెళ్లారు. ఈ సంఖ్య నిరుటి కంటే 35% అధికం. మరోవైపు వరుసగా నాలుగో ఏడాది భారత విద్యార్థులకు అమెరికా రికార్డు స్థాయిలో స్టూడెంట్ వీసాలను మంజూరు చేసింది.

## పని ఒత్తిడికి మరొకరు బలి

**బజాజ్ ఫైనాన్స్ ఉద్యోగి ఆత్మహత్య**

లక్నో : కార్పొరేట్ల విష పని సంస్కృతికి మరో ఉద్యోగి బలయ్యాడు. యూపీలోని ఝాన్సీలో బజాజ్ ఫైనాన్స్ కంపెనీ ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్న తరుణ్ సక్సేనా(42) ఆత్మహత్య చేసుకున్నాడు. టార్గెట్లు సాధించాలంటూ సీనియర్లు గత రెండు నెలలుగా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని, అవి చేయకపోతే వేతనంలో కోత విధిస్తామంటూ బెదిరిస్తున్నారని అతను సూసైడ్ నోట్‌లో ఆరోపించాడు. 'పని ఒత్తిడి కారణంగా 45 రోజులుగా నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నా. సరిగ్గా తిండి తినలేకపోతున్నా. అసాధ్యమైన టార్గెట్లతో వేధిస్తున్నారు. చేయకపోతే ఉద్యోగం లోంచి తీసేస్తామంటూ బెదిరిస్తున్నారు' అని సూసైడ్ నోట్‌లో తెలిపాడు. తరుణ్ సక్సేనాకు తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఆరోపణలపై బజాజ్ ఫైనాన్స్ ఇంకా స్పందించ లేదు.

# సీఎం పదవి కోసం వెయ్యి కోట్లు రెడీ!

- **ఇప్పటికే 'గ్రేట్ లీడర్' వద్ద సిద్ధంగా నగదు**
- **కర్ణాటక బీజేపీ సీనియర్ నేత యత్నాల్ సంచలన వ్యాఖ్యలు**
- **న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్న డీకే శివకుమార్**



*బసనగౌడ*

బెంగళూరు, సెప్టెంబర్ 30: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పదవికి రాజీనామా చేస్తారని కథనాలు వస్తున్న తరుణంలో ఆ రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. మీడియాతో మాట్లాడిన ఆయన 'ఓ గొప్ప నాయకుడు కర్ణాటక సీఎం పదవిని చేజిక్కించుకోవటానికి రూ.1,000 కోట్లతో సిద్ధంగా ఉన్నాడు. ఆ గ్రేట్ లీడర్ ఎవరో ప్రజలందరికీ తెలుసు. ఆయన పేరును నేను బహిర్గతం చేయను. గతంలో ఆయన ఇంట్లో నోట్ల కౌంటింగ్ మిషన్ కూడా దొరికింది. డిసెంబర్ నాటికి రాష్ట్ర రాజకీయాల్లో భారీ తిరుగుబాటు తెచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాడు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కారును పడగొట్టేందుకు బీజేపీ ఎలాంటి చర్యలు చేపట్టబోదని, దానంతట అదే కూలిపోతుందని వెల్లడించారు. కాగా, యత్నాల్ వ్యాఖ్యలను ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా పరిగణించారు. సోమవారం ఆ రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వరతో భేటీ అనంతరం డీకే మాట్లాడుతూ.. 'కేపీసీసీ సమావేశం నిర్వహించాం. రూ.1,200 కోట్లతో తమ ప్రభుత్వాన్ని కూలదోయాలని కుట్ర పన్నినట్టు చెప్పారు. మా లీగల్ టీంతో దీనిపై చర్చిస్తాం. పార్టీ హైకమాండ్‌కు కూడా నివేదించాం. ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో దీనిపై దర్యాప్తు జరగాలి' అని పేర్కొన్నారు.

**పరమేశ్వరతో డీకే భేటీ**

సీఎం మార్పుపై చర్చ జరుగుతున్న సందర్భంలో పరమేశ్వరతో డీకే భేటీ కావటంపై రాజకీయ వేడి రాజుకుంది. అయితే ఈ భేటీలో ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదని డీకే స్పష్టంచేశారు. పార్టీ మ్యానిఫెస్టోపై చర్చించామని తెలిపారు.

# సిద్ధరామయ్యపై ఈడీ కేసు

➤ మొదటిపేజీ తరువాయి...

మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా వీరిపై తాజాగా ఈడీ ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదుచేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం దర్యాప్తు సమయంలో నిందితులను ప్రశ్నించేందుకు, వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు ఈడీకి అధికారం ఉంది.

**ఆ 14 స్థలాలు వెనక్కిచ్చేస్తా: సిద్ధరామయ్య భార్య**

తనకు ప్రభుత్వం కేటాయించిన 14 స్థలాలను వెనక్కి ఇచ్చేస్తానని సిద్ధరామయ్య సతీమణి పార్వతి. ముడా కమిషనర్‌కు లేఖ రాశారు. తన నుంచి ప్రభుత్వం తీసుకున్న కేసరె గ్రామంలోని మూడెకరాల 16 గుంటల భూమికి బదులుగా ముడా మైసూర్‌లోని విజయనగర్‌లో 14 ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించిందని, అయితే దానికి సంబంధించిన సేల్ డీడ్‌ను రద్దు చేయడం ద్వారా స్థలాలు వెనక్కి ఇచ్చేయడానికి తాను సిద్ధమని ముడా కమిషనర్‌కు రాసిన లేఖలో తెలిపారు. ఈ భూముల కేటాయింపుకు సంబంధించి సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణ నేపథ్యంలోనే ఆమె ఈ లేఖ రాసినట్టు భావిస్తున్నారు.




*బీహార్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. సోమవారం సుపాల్ జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ వరద బాధితులను సకాలంలో ఇలా రక్షించింది.*

# హిమాచల్ కాంగ్రెస్ సర్కార్‌కు పెన్షనర్ల సెగ

- **9వ తేదీన పింఛన్లు ఇస్తామని సుఖ్వీందర్ సర్కారు ప్రకటన**
- **తీవ్రంగా మండిపడ్డ పింఛనర్లు.. 1వ తేదీనే ఇవ్వాలని డిమాండ్**
- **లేకపోతే రాష్ట్ర వ్యాప్త నిరసనలకు దిగుతామని ప్రభుత్వానికి హెచ్చరిక**

ధర్మశాల, సెప్టెంబర్ 30: హిమాచల్‌ప్రదేశ్‌లో అలివికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు వాటిని అమలుచేయలేక అల్లాడిపోతున్నది. ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు చెల్లించడానికి కూడా సతమతమవుతున్నది. గత నెలలో ఉద్యోగుల వేతనాలు ఐదు రోజులు, పెన్షనర్ల పింఛన్ 10 రోజులు ఆలస్యంగా చెల్లించిన సుఖ్వీందర్ సుఖు సర్కారు.. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లను అక్టోబర్ 9న చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో పెన్షనర్లు భగ్గుమన్నారు.

కాంగ్రెస్ సర్కార్ నిర్ణయంపై హిమాచల్ ప్రదేశ్ పెన్షనర్స్ సంక్షేమ సంఘం తీవ్రంగా మండిపడింది. 9వ తేదీ కాదు ప్రతినెలా ఒకటో తేదీకి చెల్లించాల్సిందేనని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించింది. సవరించిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది. పెన్షనర్లు, ఉద్యోగుల కారణంగా ఖజానా ఖాళీ అవ్వడం లేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్‌పర్సన్లు, కార్యదర్శులు వనరులను దోపిడీ చేస్తున్నారని సీఎం సుఖ్వీందర్ ప్రభుత్వంపై సంఘం అధ్యక్షుడు సురేశ్ ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం వరుసగా రూ.1200 కోట్లు, 800 కోట్లు చెల్లించాల్సి ఉంది.




### కొవిడ్ లాక్‌డౌన్ కాలంలో చంద్రుడిపై ఉష్ణోగ్రతలు డౌన్

న్యూఢిల్లీ: కొవిడ్-19 లాక్‌డౌన్‌తో భూమిపై మానవ సంచారం సహా కార్యకలాపాలన్నీ నిలిచిపోయిన వేళ ఆశ్చర్యకరంగా చంద్రుడిపై ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. 2020 ఏప్రిల్-మే మధ్య జాబిల్లిపై ఉష్ణోగ్రతలు అసాధారణంగా పడిపోయినట్టు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. రాత్రివేళ ఉష్ణోగ్రతలు 8-10 డిగ్రీల వరకు తగ్గిపోయినట్టు పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబరేటరీ పరిశోధకులు కే దుర్గా ప్రసాద్, జీ అంబిలీ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కరోనా వల్ల పలు రంగాలు పనిచేయకపోవడం వల్ల ఈ ప్రభావం చంద్రుడిపై పడిందని చెప్పారు.



### 81 ఏండ్ల అందాల బామ్మ

సియోల్, సెప్టెంబర్ 30: సౌత్ కొరియాలో తాజాగా నిర్వహించిన మిస్‌యూనివర్స్ కొరియా పోటీల్లో 81 ఏండ్ల బామ్మ చోయ్ సూన్-హ్వా పాల్గొని రికార్డు సృష్టించారు. యువతులతో పోటీ పడి ఔరా అనిపించారు. క్యాట్ వాక్‌తో హొయలొలికించారు. బామ్మకు కిరీటం దక్కకపోయినా.. బెస్ట్ డ్రెస్సర్ అవార్డు లభించింది. కాగా, ఈ పోటీల్లో 22 ఏండ్ల ఫ్యాషన్ స్కూల్ స్టూడెంట్ హన్ ఏరియల్ మిస్ కొరియన్ కిరీటాన్ని దక్కించుకుంది. నవంబర్‌లో మెక్సికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీలకు ఆమె దక్షిణకొరియా తరపున పాల్గొంటారు.



### నిద్రపోవడం ద్వారా 9 లక్షలు గెలుచుకుంది

బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ సాయిశ్వరి పాటిల్ ఎక్కువసేపు నిద్రపోవడం ద్వారా 'స్లీప్ చాంపియన్'గా నిలిచి రూ. 9 లక్షలు గెలుచుకున్నారు. బెంగళూరు స్టార్టప్ ఇనిషియేటివ్ వేక్‌ఫిట్ వరుసగా మూడో సీజన్ లోనూ 'స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం' నిర్వహించింది. పోటీదారులు ప్రతి రాత్రి 8 నుంచి 9 గంటలు నిద్రపోవాల్సి ఉంటుంది. పోటీదారుల నిద్ర అలవాట్లను మెరుగుపరిచేందుకు, స్లీప్ చాంపియన్ టైటిల్ గెలుచుకునే అవకాశాన్ని చేజిక్కించుకునేందుకు స్లీప్ ఎక్స్‌పర్ట్స్‌తో వర్క్‌షాపులు కూడా వేక్‌ఫిట్ నిర్వహిస్తుంది.




### అనుపమ్ ఖేర్ ఫొటోతో రూ. 500 నకిలీ నోట్లు

అహ్మదాబాద్: బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ ఫొటోతో రూ.500 నోట్లను ముద్రించిన కేటుగాళ్లు.. వాటితో గుజరాత్‌కు చెందిన బంగారం డీలర్ మెహుల్ ఠక్కర్‌ను నిండా ముంచారు. బంగారం కొనుగోళ్ల పేరుతో రూ.1.6 కోట్ల మేర టోకరా వేశారు. ఠక్కర్ ఉద్యోగుల నుంచి బంగారం బిస్కట్లను తీసుకుని ఉడాయించారు. నకిలీ నోట్లపైన 'రిసోల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని రాసి ఉంది. ఈ ఘటన సెప్టెంబర్ 24న జరిగింది. కేటుగాళ్లు రెండు రోజుల క్రితమే హవాలా ఆఫీస్ తెరచి ఈ మోసానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.



### ఐఏఎస్ కోచింగ్ ఫీజు కోసం బాలుడి కిడ్నాప్

పాట్నా: ఉత్తరప్రదేశ్‌లోని దేవరియాకు చెందిన ఓ వ్యక్తి (25) యూపీఎస్‌సీ కోచింగ్ ఫీజు కోసం నేరానికి పాల్పడ్డాడు. నిందితుడు బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాకు వెళ్లాడు. వర్షం పడుతున్నదని, ఇంట్లో కాస్త చోటు ఇవ్వాలని ఓ మహిళను కోరాడు. ఆమె అంగీకరించడంతో ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఆమె గదిలోకి వెళ్లి, తిరిగి వచ్చి చూసేసరికి ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని తీసుకుని నిందితుడు పారిపోయాడు. బాలుడిని విడిచిపెట్టాలంటే రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దేవరియాలో బాలుడిని గుర్తించారు.

## యా యా యా అనొద్దు.. ఇది కాఫీ షాప్ కాదు

**న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం**

న్యూఢిల్లీ: విచారణ సమయంలో 'యా యా' అనే పదాలను ఉపయోగించిన న్యాయవాదిపై సీజేఐ చంద్రచూడ్ సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీజేఐగా పని చేసిన జస్టిస్ రంజన్ గొగోయ్‌ని ప్రతివాదిగా చేర్చి ఓ పిటిషన్‌ను ఆ న్యాయవాది దాఖలు చేశారు. తన పిటిషన్‌ను జస్టిస్ గొగోయ్ తప్పుడు పద్ధతిలో డిస్మిస్ చేశారని ఆరోపించారు. ఆయనపై ఇన్-హౌస్ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ, ఓ న్యాయమూర్తిని ప్రతివాదిగా చేర్చుతూ పిల్ ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ఆ న్యాయవాది స్పందిస్తూ, 'యా యా, అప్పటి సీజేఐ రంజన్ గొగోయ్. నన్ను క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేయమన్నారు' అని చెప్పారు. 'యా యా యా అనొద్దు. 'యెస్' అనండి. ఇది కాఫీ దుకాణం కాదు' అని సీజేఐ అన్నారు.

## బుల్డోజర్ కూల్చివేతలపై అస్సాంకు కోర్టు ధిక్కరణ నోటీసు

న్యూఢిల్లీ: అస్సాం ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సోమవారం కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టవద్దంటూ సుప్రీం కోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ధిక్కరించి తమ ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేసిందని ఆరోపిస్తూ 47 మంది పౌరులు అస్సాం ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారించిన జస్టిస్‌లు బీఆర్ గవాయి, కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం, దీనిపై మూడు వారాల్లో స్పందన తెలియజేయాలంటూ అస్సాం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## బుల్డోజర్‌తో కూల్చివేతలు అధికారులపై గ్రామస్థుల దాడి

ఫరుఖాబాద్: తమ గ్రామంలో చేపట్టిన బుల్డోజర్ చర్యపై ఆగ్రహించిన గ్రామస్థులు పోలీసుల సమక్షంలోనే ఇద్దరు రెవెన్యూ అధికారులపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఉక్రా గ్రామంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ బంజరు భూమిలో నిర్మించిన పలు నిర్మాణాలను శనివారం అధికారులు బుల్డోజర్లతో కూల్చేశారు. సోమవారం బీజేపీ నాయకులు గ్రామస్థులు, సర్కిల్ అధికారి, ఎస్‌హెచ్‌వోతో మాట్లాడుతుండగా కోపోద్రిక్తులైన గ్రామస్థులు ఇద్దరు లేఖ్ పాలక్‌ల(రెవెన్యూ అధికారులు)పై దాడి చేశారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని నియంత్రించారు.

## దళిత విద్యార్థికి సుప్రీం అండ

- **గడువులోగా ఫీజు చెల్లించలేకపోయిన విద్యార్థి**
- **అడ్మిషన్ కల్పించాలని ఐఐటీ ధన్‌బాద్‌కు కోర్టు ఆదేశం**

న్యూఢిల్లీ: గడువులోగా ఫీజు చెల్లించలేకపోయిన దళిత విద్యార్థికి సుప్రీంకోర్టు అండగా నిలిచింది. ఆ విద్యార్థిని బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులో చేర్చుకోవాలని ఐఐటీ ధన్‌బాద్‌ను ఆదేశించింది. యూపీలోని ముజఫర్‌నగర్ జిల్లా, టిటోరా గ్రామస్థుడు అతుల్ కుమార్ (18) జూన్ 24 నాటికి రూ.17,500 యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆయన తండ్రి రోజువారీ వేతన ఉద్యోగి కావడంతో ఆ ఫీజును చెల్లించలేక సీటును కోల్పోయాడు. మద్రాస్ హైకోర్టు సలహా మేరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## దేశవాళీ ఆవులు 'రాజ్యమాత-గోమాత'లు

**మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటన**

ముంబై: అసెంబ్లీ ఎన్నికల ముంగిట మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దేశవాళీ ఆవులను 'రాజ్యమాత-గోమాత'లుగా ప్రకటించింది. వేద కాలం నుంచి వీటికి గొప్ప ప్రాధాన్యం ఉండటం, మానవుల పోషకాహారం, ఆయుర్వేదం, పంచగవ్య చికిత్స, ప్రకృతి సాగు విధానాల్లో ఆవు పాలు, ఎరువుల వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయం, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య శాఖ సోమవారం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.